తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కోహీర్‌లోని కస్బా కాలనీవాసులు

కోహీర్, జూన్ 12: తాగునీటి సమస్యను పరిష్కరించాలని పట్టణంలోని కస్బా కాలనీ వాసులు బుధవారం ఎంపీడీవో భారతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కస్బా కాలనీలో ఉన్న బోరు మోటరు చెడిపోయి ఆరు నెలలు కావస్తున్నా ఇంత వరకు ఎలాంటి మరమ్మతులు చేయించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్ లీకేజీలతో సరస్వతీ శిశుమందిరం సమీపంలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంకు వరకు నీటి సరఫరా కావడం లేదని విన్నవించారు.

తైబజార్ వేలం వాయిదా

హత్నూర, జూన్ 12 : మండల పరిధిలోని దౌల్తాబాద్ తైబజార్ వేలంపాట వాయిదా పడిందని గ్రామ పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ తెలిపారు. బుధవారం దౌల్తాబాద్ పంచాయతీకి తైబజార్ వేలం పాట నిర్వహించామని తెలిపారు. కొందరు మాత్రమే పాల్గొని రూ.5.45లక్షల వరకు వేలం పాడినట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారులు దౌల్తాబాద్ పంచాయతీకి రూ.9.16లక్షలు నిర్ణయించగా ఆశించి నస్థాయిలో వేలంపాట పాడకపోవడంతో వాయిదావేసి శుక్రవారం మళ్లీ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వసతిగృహంలో ప్రవేశాలు

హత్నూర, జూన్12: హత్నూర, సిరిపుర, దౌల్తాబాద్ గ్రామాల్లోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాల్లో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ వార్డెన్లు బద్రిప్రసాద్, శంకరయ్య తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరి వసతి గృహంలో ఉండడానికి 6నుంచి 10వ తరగతి వరకు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. సిరిపుర ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహంలో ఆయా తరగతులకు సంబంధించి 65, హత్నూరలో 50, దౌల్తాబాద్‌లో 80ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు బోనాఫైడ్, ఆదాయం, కులం ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్‌కార్డు, మార్కుల మెమో జిరాక్స్ తీసుకు రావాలని కోరారు.

అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బొల్లారం, జూన్ 12 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ కళాశాలలో పార్ట్ టైం అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ కెమిస్ట్రీ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఎమ్మెస్సీ కెమిస్ట్రీతో పాటు బీఈడీ ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మరిన్ని వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయురాలి మృతికి సంతాపం

లక్ష్మి (ఫైల్)

న్యాల్‌కల్, జూన్ 12 : మండల పరిధిలోని హద్నూర్ మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు లక్ష్మి మృతికి ఎంఈవో మారుతీరాథోడ్, పాఠశాల హెచ్ఎం తుకారాం సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని దత్తగిరి కాలనీలో నివాసం ఉంటున్న ఆమె ఇంట్లో నిద్రిస్తున్న చోటే మృతి చెందినట్టు తోటి ఉపాధ్యాయులు తెలిపారు. రాయికోడ్ మండలంలోని సింగీతంలో జరిగిన ఆమె అంత్యక్రియల్లో పాఠశాల ఉపాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

గుమ్మడిదల: బొంతపల్లిలో విద్యాసామగ్రి అందజేస్తున్న ఎంపీపీ ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి

న్యాల్‌కల్: హద్నూర్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేసిన ఎంఈవో మారుతీరాథోడ్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

మోగిన బడిగంట ▪ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ ▪ పలు పాఠశాలల్లో కానరాని వసతులు

గుమ్మడిదల, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారని ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొంతపల్లి జడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి ఎంఈవో రాంబాబు ఎంపీటీసీ నాగేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు సద్దివిజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చేర్పించాలి

న్యాల్‌కల్, జూన్ 12 : మండలంలోని మామిడ్గి, మిర్జాపూర్(బి), న్యాల్‌కల్, మెటల్‌కుంట, చాల్కి, డప్పూర్, కలబేమల్, రేజింతల్ గ్రామాల్లో బుధవారం ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఎంఈవో మారుతీ రాథోడ్ విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను అందజేశారు.

దోమడుగులో డిజిటల్ క్లాస్‌లు ప్రారంభం

గుమ్మడిదల, జూన్ 12 : మనఊరు– మన బడి ద్వారా పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు ప్రారంభమయ్యాయి. బుధవారం మండల పరిధిలోని దోమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్ డిజిటల్ క్లాసులను ప్రారంభించారు. విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేశారు.

సిర్గాపూర్‌లో..

సిర్గాపూర్, జూన్ 12 : మండల పరిధిలోని యూపీఎస్, జడ్పీ ఉన్నత పాఠశాలలకు మంగళవారం నోట్ పుస్తకాలను సీఆర్పీ శివకుమార్ స్వామి స్థానిక మండల వనరుల కేంద్రంలో బుధవారం పంపిణీ చేశారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత నోట్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు 428 మంది కేజీబీవీ విద్యార్థులకు నోట్స్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శోభ, టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

గుమ్మడిదల: దోమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాసులను ప్రారంభిస్తున్న హెచ్ఎం శ్రీనివాస్, ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్

జిన్నారంలో..

జిన్నారం, జూన్ 12 : మండల పరిధిలోని మాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం బ్యాగులు, నోటుబుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వట్‌పల్లి : ఉసిరికపల్లిలో పుస్తకాల పంపిణీ

జిన్నారం: మాదారంలో నోట్‌బుక్కులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్

సిర్గాపూర్: పాఠ్యపుస్తకాల పంపిణీ

మునిపల్లి: ఖమ్మంపల్లిలో దుస్తులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఖమ్రోద్దీన్

మునిపల్లి: ఎంఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవో దశరథ్

మోగిన బడి గంట

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 13: దాదాపు 50 రోజుల తర్వాత బడిగంట మోగింది. బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. ఆయా పాఠశాలలన్నీ విద్యార్థులతో సందడిగా మారాయి. గత ఏప్రిల్ 23 నుంచి వేసవి సెలవులు ఇచ్చిన విషయం తెలిసిందే. సంగారెడ్డిలోని పోతిరెడ్డి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మామిడి తోరణాలు కట్టి పాఠశాల ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. వేసవి సెలవుల తర్వాత విద్యార్థులు తమ తోటి స్నేహితులను కలుసుకొని తొలిరోజు సంతోషంగా గడిపారు. ఒకరికొకరు సెలవుల్లో గడిపిన సమయాన్ని గుర్తు చేసుకున్నారు.

పోతిరెడ్డి పాఠశాలకు తొలి రోజు సంతోషంగా వస్తున్న విద్యార్థినులు

మొదటి రోజు పాఠశాలకు హాజరైన విద్యార్థులు

బ్యానర్ కడుతున్న విద్యార్థులు

నీలం మధుకు గంగమ్మ జాతర ఆహ్వానం

జిన్నారం, జూన్ 12: మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో ఈనెల 16న నిర్వహించే గంగమ్మ జాతరకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధును ముదిరాజ్ సంఘం, మత్స్య సహకారం సంఘం నాయకులు ఆహ్వానించారు. బుధవారం గ్రామ మత్స్య సహకారం సంఘం సభ్యులు నీలం మధును ఆయన నివాసంలో కలిసి గంగమ్మ జాతరకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ ఎస్ మహేశ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పూజారిరాజు, నాయకులు బొగురు సత్యనారాయణ, భిక్షపతి, వీ సాయికుమార్, బీ మల్లేశ్, పీ శ్రీనివాస్, బీ భిక్షపతి, బీ బాలేశ్, కే నాగరాజు, శ్రీశైలం, పీ చిన్న శ్రీనివాస్, పీ గణేశ్, పర్వతాలు తదితరులు ఉన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఝరాసంగం, జూన్ 12 : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఝరాసంగం ఎంపీపీ దేవదాసు అన్నారు. బుధవారం ఝరాసంగం మండల కేంద్రం ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. సమావేశం ప్రారంభం కాగానే ఆయా గ్రామాల ఎంపీటీసీలు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాలకు రావడంలేదని, సమయపాలన పాటించడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ వినీల నరేశ్, మండల అభివృద్ధి అధికారి సుధాకార్, తహసీల్దార్ సంజీవరావు, ఎంపీటీసీలు విజేందర్ రెడ్డి, ఎంపీ రజినీప్రియ, సంగీత, శంకరమ్మ, ఉమావతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల సంఘ సమావేశం

రామచంద్రపురం, జూన్ 12 : మండల కేంద్రంలోని తెలంగాణ విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పుష్ప నాగేశ్ హాజరయ్యారు. అనంతరం నూతన సభ్యుడిగా వచ్చిన సంపత్‌కుమార్‌కు సభ్యత్వం అందజేశారు. అనంతరం కార్పొరేటర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రాములు, బసవరాజు, నాగభూషణం, విశ్వనాథ్, ప్రవీణ రెడ్డి, మంగతాయారు, చక్రపాణి, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతులకు అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 12 : డ్రాగన్ ఫ్రూట్‌లో అధిక దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు ఉద్యాన శాఖ అధికారులు అవగాహన కల్పించారు. మంగళవారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న రైతులతో అధికారులు సమావేశమయ్యారు. పంట సాగులో, పంటను అమ్ముకునే క్రమంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మే, జూన్ నెలలో డ్రాగన్ ఫ్రూట్ పూత దశకు చేరుకుంటుందని తెలిపారు ఎక్కువగా వచ్చిన పూతలో కొన్ని పూలను తొలగిస్తే కాయ పరిమాణం పెరిగి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. పూత ఎక్కువగా ఉంటే ఎక్కువ కాయలతో చిన్న పరిమాణం కలిగి మార్కెట్‌లో డిమాండ్ కోల్పోతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సోమేశ్వర రావు, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్, ఫల పరిశోధన శాస్త్రవేత్త సుచిత్ర, ఉద్యాన శాస్త్రవేత్త హరికాంత్, ఉద్యాన శాఖ అధికారులు పి శైలజ, బి శైలజ, సమత, కీర్తి కృష్ణ, డ్రాగన్ ఫ్రూట్ రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అందోల్ ఎంపీవో సొజన్య సస్పెన్షన్

ఎన్నికల నిధులు గోల్‌మాల్ చేయడంపై వేటు

అందోల్, జూన్ 12 : అందోల్ ఎంపీవో సొజన్యరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో రాజేశ్ బుధవారం తెలిపారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వచ్చిన నిధులను పంచాయతీ కార్యదర్శులకు చెల్లించకుండా తన వద్దే పెట్టుకోవడం, వాటి గురించి అడిగిన కార్యదర్శులను బెదిరించడంతో పాటు పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేయడంతో కార్యదర్శులు ఎంపీడీవో, ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించారు. ఇదే విషయమై నమస్తేతెలంగాణలో వరుసగా కథనాలు ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులతో పాటు కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కార్యదర్శుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో డీఎల్‌పీవో పంచాయతీ కార్యదర్శులు–ఎంపీవోతో వేర్వేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా తనవద్దే పెట్టుకోవడంతో పాటు ఇబ్బందులకు గురిచేసినట్లు తేలగా ఈ విషయాలను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆమెను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభించాలి

రామచంద్రపురం, జూన్ 12 : ఎంఐజీ కాలనీకి మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు. భారతీనగర్ డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో ఎంఐజీ కాలనీకి సంబంధించిన ఇంజినీరింగ్ జలమండలి అధికారులు సొసైటీ సభ్యులతో ఆమె ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీకి మంజూరైన రోడ్ల పనులను ప్రారంభించాలని ఏఈని ఆదేశించారు. అలాగే కల్వర్టు మరమ్మతులు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర వాటికి ప్రతిపాదనలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు రమేశ్, సుబ్రహ్మణ్యం, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఎంఐజీ కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రావు, డైరెక్టర్లు సుబ్బారావు, నారాయణ గౌడ్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

విద్యాసామగ్రి అందజేస్తున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రాయికోడ్, జూన్ 12 : తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర వెద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం రాయికోడ్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం పాఠశాలలో ఉచితంగా విద్యను అందిస్తున్నదన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే విద్య నేర్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను అప్పగించామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మల్లిఖార్జున్‌పాటిల్, ఎంపీపీ మొగులప్ప, డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం అంజయ్య, మాజీ జడ్పీటీసీ అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసయ్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్నపాటిల్, నాయకులు బస్వరాజుపాటిల్, సుల్తాన్, ప్రభాకర్, కేదారినాథ్‌పాటిల్, బీమన్న, తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బంది పనితీరు మార్చుకోవాలి



జహీరాబాద్ ఏరియా దవాఖానలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, జూన్ 12 : వైద్య సిబ్బంది తమ పని తీరును మార్చుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశించారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఏరియా దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దవాఖానలో ఇంతమంది వైద్య సిబ్బందికి ఒకేసారి సెలవు ఎలా ఇస్తారని సూపరింటెండెంట్ శ్రీధర్‌ను ప్రశ్నించారు. అనధికారికంగా సెలవులో ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఫోన్ ద్వారా కోరారు. విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. 24గంటల పాటు వైద్య సేవలు అందించేందుకు వైద్యులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఐసీయూ, డయాలసిస్ కేంద్రాలను తనిఖీ చేశారు. సిబ్బంది అందిస్తున్న చికిత్సపై రోగులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

న్యాల్‌కల్, జూన్ 12 : ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠినే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి లావణ్య హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులకు సంబంధించిన స్టాక్ రికార్డులు, నిల్వలను పరిశీలించారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, మందులను రైతులకు విక్రయించాలన్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

న్యాల్‌కల్, జూన్ 12 : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ఈ నెల 15న తలపెట్టిన బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మారుతీయాదవ్ కోరారు. బుధవారం మండలంలోని మల్లిలో బీసీ మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కామారెడ్డిలోని బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో కులగణనపై తీర్మానం చేసి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్ పెంచేందుకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఇందుకోసం తలపెట్టిన బీసీ మహాధర్నాకు బీసీ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు శ్రీపతి, విఠల్, మారుతి, సంజు, మాణిక్, రాజు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

అందోల్, జూన్ 12: పిడుగుపాటుకు ఓ మహిళ మృతి చెందిన ఘటన అందోల్ మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన అంజమ్మ (50) కొడుకు, కోడలితో కలిసి పొలం పనులకు వెళ్లి పనులు ముగించుకుని సాయంత్రం సమయంలో ఇంటికి వస్తుండగా వర్షం ప్రారంభమైంది. దీంతో బతుకమ్మ చెరువు వద్ద చెట్టుకింద నిల్చున్న సమయంలో ఒక్క సారిగా భారీ ఉరుములతో పిగుడు పడింది. దీంతో అంజమ్మ మృతి చెందగా కొడుకు, కొడలికి ఎలాంటి గాయాలు కాలేదు.

టీజీటెట్ ఫలితాలు విడుదల

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 12: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. పేపర్–1కు సంబంధించి జిల్లాలో 4,527 మంది అభ్యర్థులు టెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 4,019 మంది హాజరయ్యారు. వీరిలో 2,358 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. అలాగే టీజీటెట్ పేపర్–2కు సంబంధించి జిల్లాలో మొత్తం 3,075 మంది అభ్యర్థులు టెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 2,517 మంది హాజరయ్యారు. వీరిలో కేవలం 692 మంది అభ్యర్థులు అర్హత సాధించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగింపజేస్తున్న ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ

జిన్నారం, జూన్ 12: ఖాజీపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 181 ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను బుధవారం రెవెన్యూ అధికారులు తొలిగించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ నిర్మాణాలను తొలిగించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.